

వంతెన నిర్మాణం వేగవంతం చేయండి : 'కొరముట్ల'

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రైల్వేకోడూరు-రెడ్డివారిపల్లి మధ్యలో నూతనంగా నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ప్రభుత్వ విప్, శాసనసభ్యులు కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. మంగళవారం వంతెన నిర్మాణం పనులను కొరముట్ల పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంతెన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను కాంట్రాక్టర్లను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్ రాజు, స్థానిక నాయకులు టి.రాజేంద్ర, కాంట్రాక్టర్ పాములపాటి ప్రసాద్ నాయుడు పాల్గొన్నారు.



వంతెన పనులు పరిశీలిస్తున్న శ్రీనివాసులు

కడపలో తమ్ముళ్ల కుస్తీ

- రెండుగా చీలిన టిడిపి శ్రేణులు
- ఇంటిపోరులో కడప ఇన్‌ఛార్జి
- ఆందోళనలో టిడిపి కేడర్


'ఇంటిపోరు ఇంతింత కాదయా' అనే సామెత కడప టిడిపి పరిస్థితిని తలపిస్తోంది. అసెంబ్లీ టికెట్ రేసులో ఆర్.మాధవి, మైనార్టీ నాయకులు అమీర్‌బాబు, అలంఖాన్‌పల్లి లక్ష్మిరెడ్డి హోరా హోరీగా పోటీ పడిన సంగతి తెలిసిందే. ఇటీవల టిడిపి అధిష్టానం టికెట్‌ను మాధవికి ఖారారు చేసింది. కడప ఇన్‌ఛార్జి అసంతృప్తులను బుజ్జగింపులతో దారికి తెచ్చుకునే ప్రయత్నం చేయాలి. ఇందుకు భిన్నంగా ఎదురు తన్నుతోంది. ఎక్కడ పొరబాటు దొర్లిందో గుర్తించి చికిత్స చేసుకోవాలి. ఒకవైపు అధికార వైసిపి అభ్యర్థి సమన్వయంతో దూసుకెళ్తుండగా, ప్రతిపక్ష టిడిపి అభ్యర్థి గ్రూపులు, వేర్వేరుగా ప్రచారాలు, ప్రత్యేక శిబిరాల నిర్వహణతో రోజురోజుకూ బలహీన పడుతుండడం కేడర్‌ను ఆందోళనకు గురిచేస్తోంది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి



మాధవి

కడప టిడిపిలో అంతర్గత కుమ్ములాట పతాక స్థాయికి చేరుకుంది. రెండు నెలల కిందట టికెట్ కోసం పోటీ పడిన మాధవి, అమీర్‌బాబు, అలం ఖాన్‌పల్లి లక్ష్మిరెడ్డి మధ్య మనస్పర్థలు తొలగడం లేదు. ఎవరికి వారుగా ప్రచారాలు, ఎత్తుగడల్లో నిమగ్నం కావడం గమనార్హం. టిడిపి టికెట్ దక్కించుకున్న కడప ఇన్‌ఛార్జి మాధవి చేసిన ప్రయత్నాలు కొలిక్కి రావడం లేదు. రెండు నెలలుగా సాగించిన అగ్రెసివ్ పాలిటిక్స్ సొంత ఇంట్లో ఏర్పడిన కుంపటి కారణంగా నీరసించిపోతోంది. టికెట్ రేసు ముగిసిన అనంతరం బుజ్జగింపులు, నచ్చజెప్పడం వంటి సానుకూల ధోరణితో టిడిపి నాయకత్వాన్ని, ద్వితీయశ్రేణి కేడర్‌ను, శ్రేణులను ఏకం చేయాలి. రెండు నెలల కిందట తరహాకు ఏ మాత్రమూ తీసిపోని పరిస్థితిని తలపిస్తోంది. ఇటీవలి వరకు అసంతృప్త నేతలు వేర్వేరుగా ప్రచారాలు నిర్వహించారు. సీనియర్ నాయకులు అలంఖాన్‌పల్లి లక్ష్మిరెడ్డి అపార రాజకీయ అనుభవాన్ని, కడప అసెంబ్లీ ఓటర్ల జాబితాలోని 2,74,226 ఓట్లలో మూడింట ఒక వంతు కలిగిన మైనార్టీ ఓట్లను ఆకర్షించడానికి ఉపయోగపడే అమీర్‌బాబుని నిర్లక్ష్యం చేయడం టిడిపికి మైనస్ పాయింట్‌గా చెప్పుకోవచ్చు. తాజాగా ఓ నేత కన్వెన్షన్ హాలులో అసంతృప్త నేతలు ఆత్మీయ సమావేశాల పేరుతో కలుసుకోవడం అసమ్మతి తీవ్రతకు అద్దం పడుతోంది. టిడిపి అభ్యర్థి ఇంటి పోరును అధిగమించడం సవాలుతో కూడిన వ్యవహారంగా మారింది. ఈ నెల 10న టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కడప నగరంలో పర్యటించనున్న సంగతి తెలిసిందే. అప్పటి సమావేశంలో టిడిపి అసంతృప్త నేతలను బుజ్జగించి గాడిలో పెట్టే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. లోకేష్ అసంతృప్త నేతలను బుజ్జగించి, వారి రాజకీయ భవిష్యత్తుకు స్పష్టమైన హామీ ఇస్తే తప్పా సమస్య కొలిక్కి వచ్చే అవకాశాలు కనిపించడం లేదు.



అమీర్‌బాబు, అలంఖాన్‌పల్లి లక్ష్మిరెడ్డి

మా మద్దతు లేకుండా మాధవి ఎమ్మెల్యే అవుతారా?

ప్రజాశక్తి - కడప అర్బన్

తెలుగుదేశం పార్టీ కడప నియోజకవర్గ అభ్యర్థి మాధవి రెడ్డి తమ మద్దతు లేకుండా ఎమ్మెల్యే అవుతారా అని ఆ పార్టీ అసమ్మతి వర్గ నాయకులు ప్రశ్నించారు. మంగళవారం నగరంలోని రహమాతియ ఫంక్షన్ హాల్లో టిడిపి అసమ్మతి వర్గం అమీర్ బాబు, అలాం ఖాన్ పల్లి లక్ష్మిరెడ్డి ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కోసం తాము ఎంతో కష్ట పడ్డమని చెప్పారు. ఇన్‌ఛార్జులకు తెలియకుండా టిడిపి అభ్యర్థి మాధవి రెడ్డి తమ డివిజన్‌లలో పర్యటిస్తున్నారని పేర్కొన్నారు. పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్నారని తెలిపారు. కడపలో తెలుగుదేశం పార్టీ అధిష్టానం గొడవలు పెట్టిందని విమర్శించారు. మాధవి రెడ్డి అంటే కడపలో ఎవరికి తెలియదన్నారు. శ్రీనివాసులు రెడ్డి జిల్లా ఇన్‌ఛార్జిగా ఉన్నప్పుడు ఒక్క కార్పొరేటర్ ను గెలిపించుకోలేకపోయారని పేర్కొన్నారు. టిడిపిలో తగిన న్యాయం జరిగే వరకు పోరాడదాం అని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రశాంత పోలింగ్ నిర్వహణకు కృషి : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

త్వరలో నిర్వహించబోయే సార్వత్రిక ఎన్నికలకు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టి ప్రశాంత పోలింగ్ నిర్వహణకు కృషి చేయాలని కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులు, పోలీసు శాఖ అధికారులతో ఎన్నికలకు చేపట్టాల్సిన భద్రత ప్రణాళికల అంశంపై ఎస్‌పి బి.కృష్ణారావుతో కలిసి కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న సాధారణ ఎన్నికల పోలింగ్‌ను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు బాధ్యతాయుతంగా కృషి చేయాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య పోలింగ్ నిర్వహించాలన్నారు. ఇందుకు అన్ని రకాల ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆర్ఒలు, పోలీస్ అధికారులకు సూచించారు. గత ఎన్నికల్లో గొడవలు, అల్లర్లు జరిగిన పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించి భవిష్యత్తులో జరిగే పోలింగ్‌లో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. ఓటర్లందరూ తమ ఓటు హక్కును ప్రశాంతంగా సద్వినియోగం చేసుకుని స్వేచ్ఛాయుత పోలింగ్ జరిగేలా పక్కా ప్రణాళిక రూపొందించుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా జిల్లాలో ఆయా నియోజకవర్గాల వారీగా సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మకంగా గుర్తించిన పోలింగ్ కేంద్రాలు ఎన్ని, అక్కడ తీసుకోవాల్సిన భద్రతా చర్యలు, ప్రతి నియోజకవర్గంలో ఎన్ని స్టాటిక్ సర్వైవలెన్స్ టీమ్లు ఏర్పాటు చేశారు. ప్రతి నియోజకవర్గంలో మండల స్థాయిలో ఎస్‌సిసి బృందాలు ఏర్పాటు చేయాలన్నారు. సమస్యాత్మక, సాధారణ పోలింగ్ కేంద్రాలను వల్నబులిటి మ్యాపింగ్ పటిష్టంగా రూపొందించాలన్నారు. ఎంతమంది మైక్రో అబ్జర్వర్లను నియమించారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా సరిహద్దు ప్రాంతాలు, అంతర్రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలలో తీసుకోవాల్సిన భద్రత చర్యలపై ఎస్‌పి, పోలీస్ శాఖ అధికారులతో చర్చించారు. అనంతరం ఎస్‌పి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో సున్నితమైన, అతి సున్నితమైన పోలింగ్ కేంద్రాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బలగాలతో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాటు చేస్తామని వివరించారు. ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణంలో తమ విలువైన ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎవరైనా ఎన్నికల్లో అలజడులు సృష్టించిన, ప్రోత్సహించిన, పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. గ్రామ స్థాయిలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తుల పట్ల దృష్టి సారించి కఠిన చర్యలు తీసుకుంటామని, ఎవరైనా గొడవలకు పాల్పడిన లేదా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపైన కఠినమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. త్వరలోనే 3 కంపెనీల కేంద్ర బలగాలు కూడా వస్తాయని వారితో సున్నితమైన, అతి సున్నితమైన పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహిస్తామని చెప్పారు. డివిజన్ స్థాయి పోలీస్ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నామని ఎన్నికలలో భద్రతపరంగా పోలీస్ శాఖ నిర్వహించాల్సిన విధులపై సిబ్బందికి అవసరమైన శిక్షణ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా అంతర్రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలైన మదనపల్లి, తంబళ్లపల్లి, రాజంపేట నియోజకవర్గంలోని నెల్లూరు జిల్లా సరిహద్దు ప్రాంతం, బాలుపల్లెలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఎఎస్‌పి రాజ్ కమల్, డిఆర్ఒ సత్యనారాయణరావు, ఆర్‌డిఒలు రంగస్వామి, మోహన్‌రావు, హరిప్రసాద్ పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ రమేష్ బాబు

అవగాహనతోనే క్షయ వ్యాధి నిర్మూలన

ప్రజాశక్తి-కలికిరి

అవగాహనతోనే క్షయ నియంత్రణ సాధ్యమవుతుందని టిబి యూనిట్ అధికారి డాక్టర్ రమేష్‌బాబు అన్నారు. క్షయ వ్యాధికి చికిత్స ఉచితమని, ఈ అవకాశాన్ని వ్యాధిగ్రస్తులందరూ సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని స్థానిక హార్టికల్చర్ పాలిటెక్నిక్ కాలేజీలో టిబి మాసోత్సవాలు ప్రిన్సిపల్ బయన్న అధ్యక్షతన నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపక బృందానికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్షయ వ్యాధి లక్షణాలు, మందుల చికిత్స విధానం గురించి వివరించారు. అనంతరం వారికి క్షయ వ్యాధి లక్షణాలు గురించి వివరించారు. రెండు వారాల నుంచి దగ్గు, సాయంత్రం పూట జ్వరం రావడం, బరువు తగ్గిపోవడం, రక్తంతో కూడిన గల్లపడండం వంటివి ఉంటాయన్నారు. ఈ లక్షణాలను ఉచితంగా టిడి పరీక్షలు ట్రూ నాట్ మిషన్ ద్వారా చేస్తారని తెలిపారు. టిబి నిర్ధారణ అయిన వారికి సుమారు రూ.20 వేలు విలువ చేసే మందులు ఉచితంగా అందజేస్తామన్నారు. నెలకి రూ.500 పోషకాహార నిమిత్తం అందజేయబడుతూ పూర్తి కాలం ఆరు నెలల పాటు మందులు వాడినచో క్షయ వ్యాధి పూర్తిగా నయం అవుతుందని తెలియజేశారు. క్షయ వ్యాధి నివారణ భాగంగా 18 ఏళ్ల పైబడిన ప్రతి ఒక్కరికి బిసిజి వ్యాక్సిన్ వేస్తామన్నారు. షుగరు, బిపి ఇతర జబ్బులు ఉన్నవారు బిసిలు వ్యాక్సిన్ వేసుకోవడానికి అర్హులని తెలియజేశారు. 2025 క్షయ వ్యాధి ఎలిమినేషన్‌లో భాగంగా ప్రతి ఒక్కరూ క్షయ వ్యాధి మీద అప్రమత్తంగా అవగాహన కలిగి ఉండాలని తెలియజేశారు. క్షయ వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకోవడానికి ప్రజలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో టిబి యూనిట్ సిబ్బంది మురళి, నాగిరెడ్డి అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్నయ్యలా తోడుంటా : 'మండిపల్లి'

ప్రజాశక్తి - రాయచోటి

పట్టణంలోని ముస్లిం అక్క, చెల్లెళ్లకు అన్నయ్యలా తోడుంటానని టిడిపి అసెంబ్లీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. మంగళ వారం ఆయన పట్టణంలోని మున్సిపల్ వార్డుల్లో విస్తృతంగా పర్యటించారు. అన్ని వర్గాల ప్రజలతో పాటు వివిధ రకాల వాణిజ్య సముదాయాల యాజమానులను ఆత్మీయంగా కలిసి తమ మద్ధతును అభ్యర్తిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపల్లి 8వ వార్డులో ముస్లిం మహిళలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆయనకుముస్లిం యువత ఘన స్వాగతం పలికారు. సమావేశంలో రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ముస్లిం మహళలందరూ సైకిల్ గుర్తుకు ఓటేసి తనను ఆశీర్వదించి, తెలుగుదేశం పార్టీని గెలిపించాలని రానున్న ఎన్నికల్లో తనకు మద్ధతు ఇవ్వాలని అభ్యర్థించారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే నిత్యావసర వస్తువుల ధరలు అదుపులో ఉంటాయని, ఎటువంటి షరతులు లేకుండా పేద ముస్లిం మహిళల వివాహానికి దుల్హన్ పథకం ద్వారా ఆర్థిక సహాయం అందిస్తామని స్పష్టం చేశారు. మరీ ముఖ్యంగా కొత్తపల్లి ప్రాంతంలో నిరుపేద ముస్లిం కుటుంబాలు ఉన్నాయని, గర్భిణులకు ఎటువంటి ఖర్చు లేకుండా ఉచిత మెటర్నటీ ఆసుపత్రిని నిర్మించి కొత్తపల్లిలోని అక్కా, చెల్లెమ్మలకు కానుకగా ఇస్తానని హామీ ఇచ్చారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇంట్లో ఎంతమంది పిల్లలున్నా అందరికీ ఆర్టిక సహాయం అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో మహమ్మద్ అలీ, యూసుఫ్, అబ్బు, అబూబకర్ సిద్దిఖ్, షాహుల్, కరామత్, ఎంహెచ్‌పిఎస్ సగీర్, ఆసిఫ్, పలువురు ముస్లిం యువకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాంప్రసాద్‌రెడ్డి

పేదల సొంతింటి కల సాకారం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

పేదల సొంతింటి కలను సిఎం జగన్ నెరవేర్చారని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణంలో నిర్వహించిన నారాయణరెడ్డిగారిపల్లె జగనన్న కాలనీ ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషతో కలసి హాజరై మాట్లాడారు. పట్టణంలో 25 వేల గృహాలున్నాయని, జగన్ ప్రభుత్వంలో పట్టణ పేదల కోసం నారాయణరెడ్డిగారిపల్లె జగనన్న కాలనీలో 6500 పక్కా గృహాలు మంజూరు కావడంతో ఇక్కడ మరో పట్టణం రూపు దిద్దుకుంటోందని చెప్పారు. నారాయణరెడ్డిగారిపల్లె జగనన్న కాలనీలో భూగర్భ డ్రెయినేజీ, తాగునీరు, విద్యుత్, విద్యుత్, రహదారుల నిర్మాణం తదితర మౌలిక వసతులను కల్పించి ఆదర్శ కాలనీగా తీర్చిదిద్దుతామన్నారు. మహిళలను అన్ని రంగాలలో జగన్ ప్రభుత్వం అభివృద్ధి చేస్తోందన్నారు. అమ్మఒడి, డ్వాక్రా రుణాల మాఫీ, చేదోడు, చేయూత తదితర ఎన్నో పథకాలను మహిళలకందించి వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. జగనన్న కాలనీలలో ఇళ్ల పట్టాలు పొందిన లబ్దిదారులకు, ఆ స్థలాలపై సర్వహక్కులును ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. ఉచితంగా పంపిణీ చేసిన ఇంటి స్థలాలపై మహిళలకు సంపూర్ణ హక్కులు కల్పిస్తూ రిజిస్ట్రేషన్ కూడా చేసి హక్కు పత్రాలును అందిస్తున్నారని చెప్పారు. నారాయణరెడ్డిపల్లె జగనన్న కాలనీలో 6050 రిజిస్ట్రేషన్లకు గాను నేటికి 5395 రిజిస్ట్రేషన్లు పూర్తి అయ్యాయని, ఇక 655 మాత్రమే రిజిస్ట్రేషన్లు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని కూడా త్వరితగతిన పూర్తి చేసి లబ్దిదారులకు అందించాలని సూచించారు.కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, మదనపల్లె పరిశీలకులు హాబీబుల్లా ఖాన్, మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు, బేపారి మహమ్మద్ ఖాన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తబ్రేజ్ ఖాన్, పార్టీ పట్టణ అధ్యక్షుడు రియాజుర్ రెహమాన్, కొలిమి చాన్‌బాష, ఆసీఫ్ అలీ ఖాన్, షబ్బీర్, అల్తాఫ్, ఫయాజ్ అహమ్మద్, రియాజ్, రౌనక్, సుగవాసి ఈశ్వర ప్రసాద్, జానం రవీంద్ర యాదవ్, గౌస్ ఖాన్, అన్నా సలీం, బిసి సెల్ విజయ భాస్కర్, పల్లా రమేష్, వాల్మీకి సంఘ జిల్లా అధ్యక్షుడు గువ్వల బుజ్జిబాబు, కో-ఆప్షన్ సభ్యులు అయ్యావారురెడ్డి, హజరత్ ఖాదర్ వలీ, జిఎండి ఇర్షాద్, నేలపాటి వెంకటేష్, యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు ఇంతియాజ్, మూసా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి



మాట్లాడుతున్న శ్రీనివాసులురెడ్డి

జీవనోపాధిపై మహిళలకు అవగాహన

ప్రజాశక్తి - వీరబల్లి

సంఘ సభ్యులకు జీవనోపాదులపై అవగాహన అవసరమని డిఆర్‌డిఎ ఏరియా కో-ఆర్డినేటర్ కొండా శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక వైఎస్ఆర్ క్రాంతి పథం కార్యాలయంలో నిర్వహించిన విఒఎల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడాతూ స్వయం సహాయక సంఘాల సమావేశాలు నిర్వహించి స్థిరమైన జీవనోపాదులపై అవగాహన కల్పించాలని చెప్పారు. సంస్థల లావాదేవీలు పారదర్శకంగా ఉండాలన్నారు. స్త్రీనిధి ఎజిఎం ఉదయ్ మాట్లాడుతూ మండలంలో స్త్రీనిధి వసూళ్లు సక్రమంగా జరిగే విధంగా సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. గడికోట, సానిపాయ, గ్రామాల్లో బకాయిలు ఎక్కువగా ఉన్నాయన్నారు. లీగల్ కో-ఆర్డినేటర్ ఆనంద్‌బాబు మాట్లాడుతూ సమావేశాలలో మొబైల్ బుక్ కీపింగ్, పుస్తక నిర్వహణ సక్రమంగా జరిగితే సంఘాలు ఏ గ్రేడ్‌లోకి సంఘాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎపిఎం ఖాదర్ వలి, స్త్రీనిధి మేనేజర్ హరీష్, మండల, గ్రామ సమాఖ్యల సిబ్బంది పాల్గొన్నారు.

బూత్ ఇన్‌ఛార్జులే పార్టీకి పట్టుగొమ్మలు

ప్రజాశక్తి - రాయచోటి

బూత్ ఇన్‌ఛార్జులే తెలుగుదేశం పార్టీకి పట్టుగొమ్మలని టిడిపి అసెంబ్లీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఎస్ఎన్ కాలనీలో పార్టీ కార్యాలయం వద్ద నియోజకవర్గ వ్యాప్తంగా బూత్ ఇన్‌ఛార్జులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి బూత్ ఇన్‌ఛార్జి సైనికుడిలా పనిచేయాలని, బూత్‌ల వారీగా ప్రతి కార్యకర్తను తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులను కలుపుకొని తెలుగుదేశం పార్టీ విజయకేతనం ఎగురవేయడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కష్టాల్లో ఉన్న ప్రతి కార్యకర్తను, కుటుంబ సభ్యులను తన గుండెల్లో పెట్టుకొని కాపాడుకుంటానని తెలిపారు. గడచిన ఐదేళ్లల్లో వైసిపి వికృత చేష్టలకు నియోజకవర్గంలో ఎవరెవరు ఇబ్బందులు పడ్డారో తనకు బాగా తెలుసన్నారు. కష్టపడి పని చేసిన ప్రతి కార్యకర్తకు అధికారంలోకి వచ్చిన మరుక్షణమే సముచిత స్థానం కల్పిస్తామని తెలిపారు. ఓటమి భయంతోనే ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అనేక రకాల అసత్యాలు మాట్లాడి ప్రలోభాలు పెట్టడానికి ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యకర్తలు ఎవరూ అధైర్యపడొద్దని పేర్కొన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గం వ్యాప్తంగా ఉన్న బూత్, క్లస్టర్ ఇన్‌ఛార్జులు, నాయకులు పాల్గొన్నారు.

ఉరుసు ఉత్సవంలో ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చిన్నమండెం

సమైక్యతకు, మత సామరస్యానికి ప్రతీక అయిన హజరత్ షా అలీ గంజే షాహీద్ బాబా రాహమతుల్లా అలై హి దర్గాలో నిర్వహించిన ఉరుసు ఉత్సవంలో సోమవారం రాత్రి మైనార్టీ నాయకులు, సోదరులతో కలసి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కడప పెద్ద దర్గా పీఠాధి పతి సయ్యద్ షా ఆరీఫుల్లా హుసేనీ వద్ద ఆశీర్వాదం పొందారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, చిన్నమండెంవైస్ ఎంపిపి ఎజాస్ అలీ ఖాన్, సర్పంచ్ నజీర్ అహమ్మద్, షారుల్లా, కో- ఆప్షన్ గౌస్ సాబ్, మండల జెసిఎస్ కన్వీనర్ చుక్కా అంజనప్ప, బురాన్ ఖాన్, యేహియా ఖాన్, సజ్జాద్, అజ్రూ, జహీర్, సాదిక్, ఖదీర్, సిబక తుల్లా ఖాన్, ఎంపిటిసి వెంకటప్ప నాయుడు, సర్పంచ్ లోకేశ్వర్ రెడ్డి, మైనారిటీ జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్ ఖాన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కొలిమి హారూన్ బాష ,ఆసీఫ్ అలీ ఖాన్, జాకీర్,ఫయాజ్ అహమ్మద్ పాల్గొన్నారు.

గడికోటను కలిసిన రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-రామపురం

రాజంపేట టిడిపి పార్లమెంటరీ నియోజకవర్గం ఉపాధ్యక్షులు గడికోట విజయభాస్కర్ రెడ్డిని మంగళవారం సరస్వతి పల్లిలో రాయచోటి తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కలసి తన విజయానికి కృషి చేయాలని కోరారు. అనంతరం రాచపల్లి పంచాయితీ బీదవాళ్లపల్లిలోని తెలుగుదేశం పార్టీ అభిమాని మోడీ మోహన్ నాయుడు, సతీమణి రాణమ్మ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకొని వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు, గ్రామంలో ఇంటింటికి వెళ్లి తెలుగుదేశం తరపున ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనకు ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు.

పిసిసి అధికార ప్రతినిధిగా పూలభాస్కర్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పిసిసి అధికార ప్రతినిధిగా పూల భాస్కర్‌ను నియమించినట్లు మంగళవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తనకు ఈ పదవి రావడానికి సహకరించిన పిసిసి అధ్యక్షులు షర్మిల, ఎసిసి ఇన్‌ఛార్జి మాణిక్యం ఠాకూర్, సిడబ్ల్యూసి సభ్యులు రఘువీరారెడ్డి, సిడబ్ల్యూసి ప్రత్యేక ఆహ్వానితులు గిడుగు రుద్రరాజు, పల్లంరాజు, మీడియా చైర్మన్ తులసిరెడ్డి, రాయలసీమ జోనల్ ఇన్‌ఛార్జి జంగా గౌతమ్‌లకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ తన మీద విశ్వాసంతో తనకు ఈ పదవి ఇవ్వడానికి సహకరించిన పెద్దలందరికీ ధన్యవాదాలు తెలియజేస్తూ పార్టీ కోసం నిరంతరం క్రియాశీలకంగా పనిచేసే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారమే లక్ష్యంగా కృషి చేస్తానని పేర్కొన్నారు.



పన్నులు చెల్లించాలని అవగాహన కల్పిస్తున్న అధికారులు

నెలాఖరులోగా ఇంటి, ఆస్తి పన్నులు చెల్లించండి

ప్రజాశక్తి-బి. కొత్తకోట

ఈ నెల 31లోగా ప్రజలు ఇంటి, ఆస్తి పన్ను కట్టి వడ్డీ లేని రాయితీ పొందాలని నగర పంచాయతీ అధికారులు అవగాహన కల్పించారు. నగర పంచాయతీ కమిషనర్ పి.ఆర్.మనోహర్ ఆదేశాల మేరకు వారు పట్టణ పురవీధుల్లో ఇంటి పన్ను, ఆస్తి పన్ను వడ్డీ రాయితీపై ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023-2024 సంవత్సరానికి పట్టణ ప్రజలకు ఇంటి, ఆస్తి పన్ను వడ్డీ రాయితీని ప్రభుత్వం కల్పించిందన్నారు. మార్చి 31లోగా పన్నుల చెల్లించి వడ్డీ రాయితీ పొందాలన్నారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నగర పంచాయతీ ఆర్ఐ శ్రీనివాసులు, అకౌంటట్స్ ఆఫీసర్ రమాదేవి, జూనియర్ అసిస్టెంట్ కిరణ్ కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు

ప్రజాశక్తి-గాలివీడు

విద్యార్థులు ఇష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని శ్రీ వేంకటేశ్వర వైద్య శాల ప్రముఖ వైద్యులు డాక్టర్ మిట్టపల్లి పుల్లారెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని రవిచంద్ర ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు వారి చేతుల్లోనే నిర్మాణం అవుతుందని, ప్రతి ఒక్కరూ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.పదవ తరగతి పరీక్షలు బాగా రాసి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో యాజమాన్యం శింట్టో ఇమ్మానేయూల్, శైజూ థామస్, యం.యన్.ఆర్.జూనియర్ కాలేజ్ కరస్పాండెంట్ లయన్ అశోక్‌రెడ్డి, ప్రిన్సిపల్ నూతన్ నాయక్, ఉపాధ్యాయులు గరడప్ప, రమేష్, ఆంజనేయులు, సయ్యద్‌బాషా, గౌస్‌బాషా పాల్గొన్నారు.

'ఆదిత్య' ప్రిన్సిపల్‌కు జీవిత సాఫల్య పురస్కారం

ప్రజాశక్తి-మదనపల్లి

ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్‌కు జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం చేసినట్లు డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయి అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ మెడికల్ అండ్ ఇంజినీరింగ్ రీసెర్చ్ సొసైటీ, హైదరాబాద్ వారు తమ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సతీష్ బాబుకు జీవిత సాఫల్య పురస్కారం అవార్డు అందజేశారని తెలిపారు. ఈ సందర్భంగా పద్మశ్రీ డాక్టర్ దీక్షితులు, పద్మా అవార్డు గ్రహీత డాక్టర్ అనగాని మంజుల, రిటైర్డ్ ఐఎఎస్ ఆఫీసర్ చక్రపాణి, డాక్టర్ సతీష్ బాబు దంపతులను పూల మాలలు, మెమోంటో శాలువాలతో ఘనంగా సత్కరించారు. సాంకేతిక విద్య పట్ల ఆయన నిబద్ధతకు భవిష్యత్తు ఇంజినీర్లను తయారు చేయుటలో ఆయన చూపిన శ్రద్ధ, సల్పిన కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. 25 సంవత్సరాలు పైగా ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్‌లో ఆయన చేసిన పరిశోధనాత్మక అంతర్జాతీయ, జాతీయ ప్రచురణాలు, పేటెంట్స్ ఫండెడ్ రీసెర్చ్ ప్రాజెక్టులలో ఆయన కృషి గణనీయమైనదని పేర్కొన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ కె.సతీష్ బాబును కళాశాల చైర్మన్ ఆర్.రామ్మోహన్‌రెడ్డి, ప్రెసిడెంట్ ఎన్.నాగమల్లారెడ్డి, కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి, విభాగాధిపతులు, విద్యార్థులు అభినందించారు.



అవార్డు తీసుకుంటున్న ప్రిన్సిపల్ సతీష్‌బాబు దంపతులు



వైసిపిలో చేరిన వారితో ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి

టిడిపి నుంచి వైసిపిలో చేరిక

ప్రజాశక్తి-ములకలచెరువు

మండలంలోని వేపూరికోట పంచాయతీ కొత్తపల్లిలో గ్రామంలో మంగళవారం టిడిపి నుంచి పలువురు వైసిపిలో చేరారు. వారికి ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వైసిపిలో చేరిన వారు మాట్లాడుతూ వైసిపి గెలుపునకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మాధవరెడ్డి, జడ్‌పిటిసి మోహన్‌రెడ్డి, ఎంపిపి సాయిలీల ఉమా మహేష్, సర్పంచ్ సంఘం అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచ్ సునీత, ఎంపిటిసి అయిషా చంద్‌బాషా, సుదర్శన్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, విశ్వనాథ్, కుల్దీప్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఉపాధి'ని సద్వినియోగం చేసుకోవాలి : ఎపిఒ

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కూలీలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎపిఒ రమేష్ అన్నారు. మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఉపాధి హామీలోని మేట్లకు, పథకంలోని కొత్త సాంకేతిక మార్పులు, కొత్తరకం పనుల వివరాలు, ఎన్‌ఎంఎంఎస్ యాప్ వినియోగం మొదలగు వాటిపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఉపాధి హామీ కూలీలు చట్టాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవడానికి పలు రకాల మార్పులను తీసుకురావడం జరిగిందన్నారు. పనుల వివరాలు, కూలీల హాజరు, పనుల గుర్తింపు వంటి వివరాలను తెలుసుకోవటానికి సాంకేతిక మార్పులను ప్రభుత్వం తీసుకువచ్చిందని పేర్కొన్నారు. పథకం ద్వారా కొత్తగా చేపట్టిబోయే పనుల పైన అవగాహన కల్పించినట్లు తెలిపారు. జాబ్ కార్డు కలిగిన కూలీలు ప్రతి ఒక్కరూ వారి పనిదినాలను పూర్తిగా సద్వినియోగం చేసుకోవడానికి, అధికారులు గుర్తించిన పనులను పూర్తి చేయడానికి మేట్లు సహకరించాలని, కూలీలు పనులను పూర్తిచేసేలా ప్రోత్సహించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ మైథిలి, సిడి-సిఎల్ఆర్‌సి చందన, టిఎ బోయకొండప్ప, క్షేత్రస్థాయి సహాయకులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులకు దరఖాస్తులు అందజేస్తున్న ప్రిన్సిపల్ శివశంకర్‌రెడ్డి

గుణాత్మక విద్య అందేలా కృషి : ప్రిన్సిపల్

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

ఎపి మోడల్ పాఠశాలల్లో గుణాత్మక విద్య అందేలా కృషి చేస్తామని ప్రిన్సిపల్ కోమటిరెడ్డి శివశంకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మోడల్ పాఠశాలలో ఆరవ తరగతి ప్రవేశాలకు ప్రాథమిక పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులకు దరఖాస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరవ తరగతి నుంచి ఎపి మోడల్ స్కూల్లో సిబిఎస్ సిలబస్‌తో పాటు అటల్ టింకరింగ్ ల్యాబ్ ఒకేషనల్ కోర్సులు ఆంగ్లంలో సృజనాత్మక విద్యను అందిస్తున్నామని పేర్కొన్నారు. మీ పిల్లలకు మంచి భవిష్యత్తు ఉంటుందని ఎపి మోడల్ స్కూల్ లో చేర్పించాలని కోరారు ప్రతి విద్యార్థి ఆంగ్లంలో మాట్లాడడం పోటీ పరీక్షల్లో పాల్గొనడం క్రీడల్లో విజయాలు సాధించడం ఎన్నో వినూత్నమైన కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. పిల్లలకు మంచి భవిష్యత్తు ఉంటుందని ఈ నెల మూడో తేదీ నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేయించాలని ప్రధాన ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నిత్యపూజయ్య, సుధాకర్ శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలపై దృష్టి : డిఎస్‌పి

ప్రజాశక్తి-మలకలచెరువు

త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తంబళ్లపల్లి నియోజకవర్గంలోని సమస్య ఆత్మకంగా ఉన్న పోలింగ్ కేంద్రాల పై ప్రత్యేక దృష్టి సారిస్తామని మదనపల్లి డిఎస్‌పి ప్రసాద్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ములకలచెరువు మండల కేంద్రం లోని పాత ములకలచెరువులోని పోలింగ్ బూత్‌ను పరిశీలించారు. ఈ సందరంగా విలేకరులతో డిఎస్పీ మాట్లాడుతూ కంపలపల్లి నియోజకవర్గంలో 236 పోలింగ్ కేంద్రాల్లో 75 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకంగా ఉండగా వీటిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం ములకలచెరువు లోని పోలీస్ స్టేషన్ ను తనిఖీ నిర్వహించారు. పోలీస్ స్టేషన్లోని రికార్డులను పరిశీలించారు. రాత్రి వేళల్లో గస్తీలు నిర్వహించాలని, వాహనాల తనిఖీలను ముమ్మరం చేయాలని, అనుమానితులపై నిఘా ఉంచాలని తెలిపారు. రౌడీ షీటర్లు, గతంలో ఎన్ని కలలో సమస్యలు సృష్టిం చిన వారికి కౌన్సిలింగ్‌లు నిర్వహించాలని సిఐ, ఎస్ఐ లకు తెలిపారు. డిఎస్‌పి వెంట శిక్షణ డిఎస్‌పి ప్రశాంత్, సిఐ తమ్మిశెట్టి మధులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలపై పేదలకు సర్వ హక్కులు : 'కొరముట్ల'

ప్రజాశక్తి-చిట్వేలు

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడమే కాకుండా చరిత్రలో తొలిసారి వాటిప సర్వ హక్కులు కల్పించిన ఘనత సిఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. మంగళవారం నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా జగనన్న కాలనీలో ఇచ్చిన స్థలాలపై సర్వహక్కులు కల్పించే దస్తావేజు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు ఆర్థిక స్వావలంబన చెందినప్పుడే రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. సంక్షేమ పథకాలు అన్ని అమలు కావాలంటే మళ్ళీ జగన్ ముఖ్యమంత్రి కావాలని, అందుకు మనమంతాకృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చెవ్వ శ్రీనివాసులురెడ్డి, వైసిపి సీనియర్ నాయకులు ఎల్వీమోహన్‌రెడ్డి, ఎంపిపి చంద్ర, జిల్లా టూరిజం సుధాకర్‌రాజు, వైసిపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ మలిశెట్టి వెంకటరమణ, డైరెక్టర్ లింగం లక్ష్మీకర్, తహశీల్దార్ జ్ఞానేశ్వరి, ఎంపిడిఒ రంగారావు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసులు

ఆరవ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

:ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండలంలోని ఆదర్శ పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికిగాను 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శీను నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదర్శ పాఠశాలలలో మార్చి 3 నుండి దరఖాస్తులు చేసుకోవాలని, ఏప్రిల్ 21న ఉదయం 10 నుండి మధ్యాహ్నం 12 వరకు మండలాల్లో ఉన్న ఆదర్శ పాఠశాలల్లోనే 5వ తరగతి స్థాయి సిలబస్‌తో తెలుగు/ఇంగ్లీషు మీడియంలలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఈ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంలో మాత్రమే బోధిస్తారని, చదువుకోవడానికి ఎలాంటి ఫీజులు కట్టనవసరం లేదని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష కోసం ఒసి విద్యార్థులు రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75లను మార్చి 2 నుంచి మార్చి 31 వరకు నెట్ బ్యాంకింగ్/క్రెడిట్/డెబిట్కార్డులను ఉపయోగించి పేమెంట్ గేటవే ద్వారా పరీక్ష రుసుం చెల్లించాలని తెలిపారు. తద్వారా కేటాయించిన జనరల్ నెంబరు ఆధారంగా ఏదైనా ఇంటర్నెట్ కేంద్రంలో www.cse.ap.gov.in https://apms.apcfss.in దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆబ్జెక్టివ్ టైపులో ఉన్న ప్రవేశ పరీక్షలో ఒసి, బిసి అభ్యర్థులకు 35 మార్కులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు కనీసం 30 మార్కులు సాధించాలన్నారు. ప్రతిభ ఆధారంగా రిజర్వేషన్ నిబంధనల ప్రకారం సీట్లు కేటాయిస్తామన్నారు. ప్రవేశ అర్హత : ఒసి, బిసి విద్యార్థులు 01-09-2012, 31-08-2014 మధ్య, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 01-09-2010 నుండి 31-08-2014 మధ్య జన్మించినవారై ఉండాలన్నారు. సంబంధిత జిల్లాలో ప్రభుత్వ లేక ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాల్లో నిరవధికంగా 2022-23, 2023-24 విద్యా సంవత్సరాలు చదివి, 2023-24 విద్యా సంవత్సరంలో 5వ తరగతి చదువుతూ ప్రమోషన్ అర్హత పొంది ఉండాలన్నారు. దరఖాస్తు చేయడానికి ముందుగా వివరాలతో కూడిన సమాచార పత్రం కోసం www.cse.ap.gov.in, https://apms, apcfss. In చూడవచ్చని ప్రిన్సిపల్ శీను నాయక్ తెలిపారు.

టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా శంకర్‌నే ప్రకటించాలి



నిరసన తెలుపుతున్న శంకర్ అనుచరులు

ప్రజాశక్తి-ములకలచెరువు

మాజీ ఎమ్మెల్యే శంకర్ యాదవ్‌నే ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించాలని ములకలచెరువు మండల తెలుగుదేశం నాయకులు బురకాయలకోటలో పెద్ద ఎత్తున శాంతియుత నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ శంకర్ యాదవ్ ఎవరి నుండి ఈ ఐదేళ్లు పార్టీని, నాయకులు, కార్యకర్తలను కాపాడుకుంటూ వచ్చారో, అదే వైసిపిలో ఉన్న రౌడీలు, గుండాలు అందరూ ఈ కొత్తగా వచ్చిన ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గరే ఉన్నారని, వాళ్ళే మాపైన దాడులు చేసి ఇప్పుడు మళ్లీ టిడిపిలో చేరి మళ్లీ మాపైన పెత్తనం చెలాయించాలని చూస్తున్నారని పేర్కొన్నారు. ఐదేళ్లుగా పార్టీని తన భుజాలపైన మోసిన నాయకుడు శంకర్ యాదవ్ అని పేర్కొన్నారు. కష్టాలకు నష్టాలకు ఎదురు నిలిచి క్యాడర్‌ని కాపాడుకుంటూ వచ్చి తంబళ్లపల్లె నియోజకవర్గంలో టిడిపి గెలుపు తథ్యం అనే విధంగా పార్టీని బలోపేతం చేసిన శంకర్ యాదవ్‌ని కాదని ముక్కూ మొహం తెలిడయని వ్యక్తికి ఎమ్మెల్యే సీటు కేటాయించడం దారుణమని పేర్కొన్నారు. చంద్రబాబు ఈ నిర్ణయాన్ని మార్చి మళ్ళీ బలమైన బిసి నాయకుడు శంకర్ ఎమ్మెల్యేగా ప్రకటించాలని కోరారు. నాయకులందరూ ముక్తకంఠంతో శంకర్ యాదవ్ మాకు అభ్యర్థిగా కావాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో మండల యూనిట్ ఇన్‌ఛార్జులు రమణ మూర్తి, జెసిబి సుధాకర, నారాయణ స్వామి, వెంకట స్వామి, సుధాకర్ నాయుడు, గుత్తా సుధాకర నాయుడు, సుబ్బి నాయుడు, రామకృష్ణంరాజు, గ్రామ కమిటీ అధ్యక్షులు బసువు శ్రీనివాసులు, నాగ మల్లప్ప, చెన్నకేశవ నాయుడు, రెడ్డెప్ప, శంకరనారాయణ, కక్కల సుదర్శన, కాలా మహేష్, ఆది నారాయణ రమణారెడ్డి, చెన్నకేశవలు, రవి కుమార్, నాగరాజు యాదవ్, సోము, చంద్ర, శంకర, చంద్ర, బాలు, జగన్నాథ రాజు, కె.శ్రీనివాసులు, రెడ్డెప్ప, ఇతర నాయకులు, బూత్ కన్వీనర్లు, గ్రామ కమిటీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తాం : ఇఒ

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండల పరిధి తవళం గ్రామంలో వెలసిన శ్రీయోగా నేలమల్లేశ్వర స్వామి దేవస్థానం మహాశివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఆలయ ఇఒ మంజుల అన్నారు. మంగళవారం శ్రీ యోగా నేలమల్లేశ్వర స్వామి ఆలయం వద్ద తహశీల్దార్ బాలాజీ రాజు, ఎంపిడిఒ మైథిలి, ఎస్ఐ లోకేష్ రెడ్డి, ఎంపిపి నరసింహులు, సింగిల్ విండో అధ్యక్షుడు రెడ్డిశేఖర్‌రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ సదాశివరెడ్డి, వైసిపి మాజీ మండల ఇన్‌ఛార్జి ఆర్ఐ రమణారెడ్డి, ఆలయ తాత్కాలిక కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 8, 9వ తేదీలలో మహాశివరాత్రి పండుగ సందర్భంగా నిర్వహించే ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని తెలిపారు. శుక్రవారం రాత్రి ఆలయం వద్ద శివపార్వతుల కళ్యాణం, అనంతరం నాట్య ప్రదర్శన ఉన్నందున భక్తులు జాగారం చేస్తారన్నారు. స్వామి వారి దర్శనానికి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ఆలయం వద్ద భద్రత ఏర్పాట్లను సిద్ధం చేశామన్నారు. ఈ ఏడాది తిరుణాల సందర్భంగా నిర్వహించే దుకాణాల స్థలాన్ని వేరొక చోటికి మార్చామని, దుకాణదారులు ఇది ముందుగా గమనించి ఆలయ కమిటీకి సహకరించాలని కోరారు. భక్తుల సౌకర్యార్థం మదనపల్లి ఆర్టీసీ రెండవ డిపో వారు మదనపల్లి, నిమ్మనపల్లి, తవళం నుండి ఆలయం వద్దకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు తెలిపారు. ఆలయం వద్దకు ప్రయివేటు ఆటోలను నిషేధించినట్లు పేర్కొన్నారు. పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. ఆలయం వద్ద భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు శంకర్ శర్మ, లక్ష్మణస్వామి, ఆలయ తాత్కాలిక కమిటీ సభ్యులు గోపాలకృష్ణ, గంగాధర, రవి, శంకర, రవీంద్ర, నారాయణ, విద్యుత్ ఎఇ వసంత రెడ్డి పాల్గొన్నారు.



మహాశివరాత్రి ఉత్సవాల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అధికారులు, నాయకులు

ఆనంద్ రాజుకు సన్మానం

ప్రజాశక్తి-రామాపురం : స్థానిక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఆర్ట్ మాస్టర్‌గా పనిచేస్తున్న ఆనంద్ రాజుకు సర్ సివి రామన్ అకాడమి హైదరాబాద్ వారు ఆదివారం సికింద్రాబాద్ లోని హరిహర కళాభవన్‌లో ఉగాది పురస్కారాలు పురస్కరించుకొని స్వర్ణ కంకణం తొడిగి చిత్రకళాబ్రహ్మ బిరుదును ప్రదానం చేసి ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ తోటి ఉపాధ్యాయులు సిబ్బంది ఆయన్ను అభినందించారు.

చిన్నమండెం తహశీల్దార్‌గా ఆనంద కుమార్

ప్రజాశక్తి- చిన్నమండెం

మండల రెవెన్యూ కార్యాలయ తహశీల్దార్‌గా టి.ఆనందకుమార్ మంగళవారం బాధ్యతలు తీసుకొన్నారు. ఆయన అనంతపురం జిల్లాలో పనిచేస్తూ బదిలీపై అన్నమయ్య జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నెలరోజులు విధులు నిర్వహించారు. అక్కడ నుంచి ఆయన చిన్నమండెంకు బదిలీపై వచ్చి బాధ్యతలు తీసుకున్నారు.

16న జాతీయ లోక్ అదాలత్ : జడ్జి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

ఈ నెల 16వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జూనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్ ఎం.అంజనీ ప్రియదర్శని తెలిపారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ మహా శివరాత్రి, వరుసగా మూడు రోజులపాటు సెలవులు వచ్చినందున ఈనెల 9వ తేదీన జరగవలసిన జాతీయ లోక్ అదాలత్ మార్చి 16కు వాయిదా వేసినట్లు తెలిపారు. రాజీకాదగిన కేసులు జాతీయ లోక్‌అదాలత్ ద్వారా పరిష్కరించుకోవలసిందిగా ఆమె కోరారు. జాతీయ లోక్ ఆదాలత్ ద్వారా సమయం వృథా కాకుండా సత్వరం న్యాయం కోసం కేసులు పరిష్కరించుకోవాల్సిందిగా తెలియజేశారు.

'ఉపాధి' పనులు తనిఖీ

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపిడిఒ కృష్ణమూర్తి మంగళవారం తనిఖీ చేశారు. మూలపల్లి వద్ద కూలీలు ఏర్పాటు చేస్తున్న ఫారం పాండ్ పరిశీలించారు. ఉపాధి హామీలో నాటిన ఉద్యానవన మామిడి మొక్కలనుపరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధి పనుల్లో మరింత ఎక్కువ కూలీలు పాల్గొనే విధంగా చొరవ చూపాలని ఫీల్డ్ అసిస్టెంట్ నారాయణలు ఆదేశించారు. ఆయన వెంట ఎపిఒ అంజన్నప్ప, ఉపాధి ఇంజనీర్ రామన్న ఉన్నారు.

ఎన్నికలకు సర్వం సిద్ధం : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అతి త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ బూత్‌లు, అక్కడ కావలసినటువంటి మౌలిక వసతులు వంటి ఏర్పాట్లన్నీ సర్వం పూర్తయినట్లు ఆర్‌డిఒ పి.మోహన్‌రావు తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సంబందించి మంగళవారం ఆర్డిఒ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ బూత్ లలో తాగునీరు, విద్యుత్తు, టాయిలెట్ల వంటి మౌలిక వసతులన్నీ సమకూర్చడం జరిగిందని తెలిపారు. ప్రజా ప్రతినిధులు సంయమనం పాటించి ప్రశాంత ఎన్నికలకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు బత్యాల చెంగల్రాయులు, కోలాటం హరికృష్ణ, బండ్ల నాగరాజ, ముత్యాల చలపతి, రామా శ్రీనివాసులు, కొట్టే శ్రీహరి, అతికారి దినేష్ పాల్గొన్నారు.

రేపటి నుంచి మల్లయ్య కొండపై శివరాత్రి ఉత్సవాలు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

తంబళ్లపల్లి సమీపంలో వెలసిన శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో బుధవారం నుంచి మహాశివరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఈవో రమణ, చైర్మన్ మల్ రెడ్డి తెలిపారు. 6, 7వ తేదీలలో ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు ఉంటాయని తెలియజేశారు. 8వ తేదీ మహాశివరాత్రి రోజు ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు సహస్రనామార్చన, సాయంత్రం 6 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. రాత్రి 12 గంటల నుండి ఉదయం 4 గంటల వరకు స్వామివారి మెరువన ఉంటుందని తెలియజేశారు.

నీటి సమస్య పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి-పెద్దమండ్యం

వేసవికాలంలో గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చిత్తూరు జిల్లా పరిషత్ ఛైర్మన్ శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఆయన మండల సమస్యలను ఎంపిపి పూర్ణచంద్ర రమేష్ అడిగి తెలుసుకున్నారు. మండలంలో గతంలో గ్రామాలకు తాగునీరు తోలిన బిల్లులు రాలేదనిఎంపిటిసి జయరామ, సర్పంచ్ విశ్వనాథ తీసుకెళ్లారు ఈ విషయంపై ఆయన ఉన్నతాధికారులతో ఫోన్లో మాట్లాడి బిల్లులు పరిష్కారం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వెంకటరమణయ్య, ఎపిఒ మురళి, ఎఓ వెంకటేశ్వరరావు, ఇఒపిఆర్‌డి శ్రీధర్‌రావు, మాజీ జడ్‌పిటిసి రమేష్, సర్పంచ్‌లు పద్మావతి, తిరుపాల్, విజయకుమారి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐ గంగానాథ్‌బాబు

చాందిని బండ్లకు అనుమతి తప్పనిసరి : సిఐ

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

ఈ నెల 11,12వ తేదీలలో జరగబోవు గంగమ్మ జాతరకు చాందిని బండ్లు మొక్కుబడి ఉన్నవారు ముందుగా పోలీసుల అనుమతి తీసుకోవాలని సిఐ జీవన గంగానాథ్ బాబు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో గంగమ్మ జాతరకు సంబంధించి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంగమ్మ తల్లికి మొక్కుబడి ఉన్నవారు చాందిని బండి ఏర్పాటు చేసుకోవాలంటే ముందుగా పోలీసులు అనుమతి తీసుకోవాలన్నారు. చాందిని బండ్ల ఎత్తు పది అడుగుల లోపే ఉండాలన్నారు. చాందిని బండ్లు ముందు అశ్లీల నృత్య ప్రదర్శనలు, రికార్డు డాన్సులు, మైకు సౌండ్ బాక్సు పెట్టకూడదన్నారు. జాతరకు వచ్చే భక్తులు కుటుంబ సమేతంగా వారి వారి వాహనాలలో జాగ్రత్తగా జాతర చేరుకోవాలని పేర్కొన్నారు. విద్యుత్ వైర్లు చాందిని బండ్లకు తగలకుండా తగు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జాతరలో సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. దొంగతనాలు, మద్యం విక్రయాలు, జూదాలు వంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ విష్ణువర్ధన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఫోక్సో చట్టం కింద కేసు నమోదు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

విద్యార్థినిని వివాహమాడుతానని నమ్మించి మోసం చేసిన ఓ యువకుడిపై బి.కొత్తకోట పోలీసులు ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు సిఐ ఎన్.సూర్యనారాయణ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని కాండ్లమడుగు క్రాస్ దగ్గర నివాసముంటున్న ఒక అమ్మాయిని అనిగాని గణేష్(17) ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసి శారీరకంగా, మానసికంగా ఇబ్బందులు పెట్టాడని పేర్కొన్నారు. అతని నుండి తప్పించుకొని వచ్చి పోలీసుస్టేషనులో సదరు విద్యార్థిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేశామన్నారు. గణేష్‌ను విచారణ నిమిత్తం తిరుపతి జువైనల్ కోర్టుకు తరలించామన్నారు.

కబ్జాదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

ప్రజాశక్తి కలికిరి

పట్టణంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల స్థలాన్ని వైసిపి నేతలు ఆక్రమించుకోవాలనుకోవడం దుర్మార్గమని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు బుక్కే విశ్వనాథ నాయక్, ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు అన్నారు. ఆక్రమించడానికి ప్రయత్నించిన కళాశాల స్థలాన్ని మంగళవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చిన ఈ ఐదు సంవత్సరాల కాలంలో ప్రభుత్వ భూములు, కుంటలు, వాగులు, గుట్ట పరంబోగులు, చుక్కల భూములు ఆక్రమించుకున్నది చాలక ఆఖరికి భావితరాలకు ఉపయోగపడే కళాశాల స్థలాన్ని కూడా ఆక్రమించుకోవాలనుకోవడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్రమణకు పాల్పడిన వారిపైన చట్ట ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కళాశాల స్థలాన్ని కాపాడుటకు జిల్లా సర్వోన్నత అధికారి చోరువ చేసుకొని నిధులు కేటాయించి ప్రహరీ గోడ నిర్మించాలని డిమాండ్ చేశారు. ఇండ్ల పట్టాల పేరిట రూ.కోట్ల విలువైన కళాశాల స్థలాన్ని ఎమ్మెల్యే అండదండలతో కళాశాల సిబ్బంది పైన, అడ్డుకోబోయిన విద్యార్థినిలపైన, దౌర్జన్యం చేయడం సిగ్గుచేటని అలాంటి వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నాయకులు లోకేష్, ప్రశాంత్ పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారంలో నల్లారి

ఓటర్లను ప్రభావితం చేయడం సిగ్గుచేటు : 'నల్లారి'

ప్రజాశక్తి-పీలేరు : ఎన్నికలు దగ్గర పడుతుండగా ఓటర్లను ప్రభావితం చేయడానికి విలువలేని చీరలు పంపిణీ చేయడం సిగ్గుచేటని ప్రజలు, మహిళలు అస హ్యించు కొంటున్నారని రాష్ట్ర ప్రజలను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మరో మోసానికి తెర లేపుతున్నరని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి ప్రభుత్వంపై మండిపడ్డారు. మంగళవారం ఆయనను పీలేరు పట్టణం, తిరుపతి రోడ్డులోని రజకుల కాలనీ, నాయీబ్రాహ్మణ కాలనీ, విశ్వ బ్రాహ్మణ కాలనీల్లో అభిమానులు, ప్రజలు, మహిళలు బాజా, భజంత్రీలు, బాణసంచా, మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు. కిషోర్ కుమార్‌రెడ్డి టిడిపి-జనసేన నాయకులతో కలిసి బాబు ష్యూరిటీ-భవిషత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో ఇంటింటా తిరిగి టిడిపి ప్రవేశ పెట్టనున్న పథకాలు వివరిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి నాయకులు భూ ఆక్రమ ణలు, అక్రమ ఇసుక, మైన్స్, చీప్ లిక్కర్లతో వేల కోట్లు సంపాదించి ఓటర్లను కొనాలని చూస్తున్నారని ఆరోపించారు. వైసిపి ఎంపీ, ఎమ్మెల్యేలు ఎన్ని ఎత్తులు,వేసినా, జిమ్మిక్కులు చేసినా ప్రజలు నమ్మి ఓట్లు వేసే పరిస్థితి లేదని అన్నారు. వైసిపి పరిపాలనలో కార్మికులకు పని ముట్లు లేవు, నిరుద్యోగులకు ఉద్యోగాల్లేవు, కార్పోరేషన్లలో నిధుల్లేవు, విద్యుత్, ఆర్టీసీ చార్జీలు, పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెంచి, ఆఖరికి చెత్త మీద కూడా పన్ను వేసే ఆలోచన జగన్ రెడ్డికు రావడం రాష్ట్ర ప్రజల దురద ృష్టమని చెప్పారు. వ్యవస్థల్ని చెప్పు చేతల్లో పెట్టుకుని ప్రతిపక్షాలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసి అధికారుల్ని బలి పశువులు చేయడం తగదని హితవు పలికారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రంగాల వారీగా అందరికి సంక్షేమ పథకాలు, ఉద్యోగ అవకాశాలు కల్పించడమే తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు లక్ష్యమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా, జనసేన నాయకులు కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బాలికను బెదిరిస్తున్నారని ఫిర్యాదు

ప్రజాశక్తి-రామసముద్రం : బాలికను బెదిరించిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రామసముద్రం దిగువ హరిజనవాడకు చెందిన ఒక బాలికను గత నెల 25వ తేదీ అదే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు భయపెట్టి కిడ్నాప్ చేసి తనకు వరసకు బావ అయిన సుదర్శన్ అనే వ్యక్తిని పెళ్లి చేసుకోమని కొట్టి నిర్బంధించినారని, పెళ్లి చేసుకోకపోతే చంపుతామని బెదిరించినట్లు తెలిపారు. వారి బారి నుండి తప్పించుకొని తన తండ్రి వద్దకు చేరుకొన్నట్లు తన తండ్రికి జరిగిన విషయం చెప్పగా తన కూతురి జీవితం ఇబ్బంది పడుతుందనే ఉద్దేశంతో గ్రామ పెద్దల ద్వారా సమస్యను పరిష్కరించుకుందామని చూసినా కానీ సుదర్శన్, మని, ప్రశాంత్ ఆ అమ్మాయిని ఇబ్బంది పెడుతుంటే ఫిర్యాదు చేశారని చెప్పారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

ఆరుగురు జూదరులు అరెస్టు

ప్రజాశక్తి-రామాపురం : మండలంలోని బాలిరెడ్డిగారిపల్లి తూర్పు భాగంలోని కంపపొదల్లో మంగళవారం జూదం ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి నగదును స్వాధీనం పరుచుకున్నట్లు ఎస్ఐ వి.ఎల్. ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. తమకు సమాచారం రావడంతో వెంటనే తమ సిబ్బందితో వెళ్లి వారిపై దాడి చేశామన్నారు. జూదం ఆడుతున్న మద్దూరి రెడ్డయ్య, మరో ఐదుగురిని అదుపులోకి తీసుకుని రూ.49.750 నగదును స్వాధీనం పరుచుకున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.